క్లుప్తంగా

పేదలకు దుస్తులు, దుప్పట్ల పంపిణీ



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న గండి తాతాజీ

రోలుగుంట : కుసుర్లపూడిలో 500 మంది పేదలకు మాజీ సర్పంచ్ గండి తాతాజీ తన స్నేహ బృందంతో కలిసి గురువారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు దశాబ్దాలు పైగా తన తల్లిదండ్రులు ముక్కనుమ తర్వాత గ్రామంలో పేదలకు దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం కొనసాగింపులో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పేదలు సర్పంచ్, అతని స్నేహ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

జోనల్ స్థాయి పోటీలకు అర్హత



అర్హత సాధించిన జట్టుతో నిర్వాహకులు

రావికమతం : ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలో రావికమతం సచివాలయం జోనల్ లెవల్ పోటీకి ఎంపికైనట్టు ఎంపీడీవో వెంకన్నబాబు గురువారం తెలిపారు. 24 సచివాలయాలకు జరిగిన క్రికెట్ టోర్నమెంట్‌లో రావికమతం, కొత్తకోట సచివాలయాలు ఫైనల్స్‌కు చేరగా గురువారం ఆ ఇద్దరి మధ్య పోటీ రసవత్తరంగా జరిగింది. కొత్తకోట సచివాలయం మొదట బ్యాటింగ్ చేసి ఎనిమిది ఓవర్లలో 33 రన్స్ చేయగా రావికమతం సచివాలయ సిబ్బంది 3.3 ఓవర్లలోనే లక్ష్యాన్ని అధిగమించి జోన్ లెవల్ పోటీకి అర్హత సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు.

శ్రీరాముని అక్షింతలు అందజేత



తహసీల్దార్ మహేశ్వరరావుకు రాముని అక్షింతలు అందజేస్తున్న వీహెచ్‌పీ సభ్యులు

రావికమతం : అయోధ్య రామాలయం నుంచి వచ్చిన అక్షింతలను గురువారం రావికమతంలో విశ్వ హిందూ పరిషత్ సభ్యులు తహసీల్దార్ మహేశ్వరరావుకు అందజేశారు. ఈ నెల 22న దీపాలు వెలిగించే కార్యక్రమం చేపట్టడంతో పాటు కార్యాలయ సిబ్బందికి తగిన సూచనలు చేయాలని కోరారు. సంఘ కన్వీనర్ జీపీఎస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సిద్ధమైన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్



సత్యవరంలో ప్రారంభానికి సిద్ధమైన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్

మాడుగుల : మండలంలోని సత్యవరం గ్రామంలో సుమారు రూ. 20 లక్షలతో నిర్మించతలపెట్టిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ సర్వాంగ సుందరంగా తయారయింది. అతి త్వరలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు దీనిని ప్రారంభించనున్నారని ఎంపీటీసీ సభ్యుడు తలారి అప్పారావు తెలిపారు. ఈ క్లినిక్ అందుబాటులోకి వస్తే మెరుగైన వైద్యం అందుతుందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

కె.కోటపాడు : గ్రామాల్లో అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాల నిర్మాణాలు చివరిదశకు చేరుకున్నాయని, మిగిలిన పనులు పూర్తయ్యేలా చూడాలని ఆయన కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల ఏఈ, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఆయన సమావేశం జరిపారు. ఎంపీడీవో ప్రసాద్, ఏఈలు బాలాజీ అప్పారావు, అల్లు శ్వేత తదితరులు పాల్గొన్నారు.

జాతర్లతో.. పల్లెలు జిగేల్

- ఉత్సాహంగా పాల్గొంటున్న పిల్లలు.. పెద్దలు
- స్థానిక ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో మహిళల పూజలు



కొంకసింగి తీర్థంలో జనం సందడి



నాతవరం పుర వీధుల్లో కుంతీదేవి విగ్రహాన్ని ఊరేగిస్తున్న నాయకులు, స్థానికులు



సింగన్నదొరపాలెంలో అమ్మవారికి పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు సూర్యనారాయణ



ఎ. కొత్తపల్లిలో కబడ్డీ క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నాయకులు



ఎ. కొత్తపల్లిలో హోరాహోరీగా సాగుతున్న బాలుర కబడ్డీ పోటీలు

కె.కోటపాడు : మండలంలో సింగన్నదొరపాలెం, గొట్లాం, చౌడువాడ గ్రామాల్లో గురువారం ఘనంగా తీర్థ మహోత్సవాలు జరిగాయి. సింగన్నదొరపాలెంలో మరిడిమాంబ, గొట్లాంలో చింతాలమ్మ, చౌడువాడలో శ్రీకృష్ణుని తీర్థ మహోత్సవాలు జరిపిన భక్తులు ఘనంగా పూజలు చేశారు. సింగన్నదొరపాలెంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు రొంగలి సూర్యనారాయణ, రొంగలి వెంకటరమణ, లాలం నాని, మాజీ ఎంపీపీ నారపాటి శ్రీరామ్మూర్తి, ఎంపీటీసీ సభ్యురాలు రొంగలి లక్ష్మి పూజలు చేశారు.

ఘనంగా కుంతీదేవి ఊరేగింపు..

నాతవరం: మండల కేంద్రంలో గురువారం కుంతీదేవి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. నాతవరం ఎస్సీ కాలనీలో పూర్వం నుంచీ కుంతీదేవిని ఇంటి ఇలవేల్పుగా పూజిస్తారు. నెల రోజుల పాటు కుంతీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి సంక్రాంతి పండగ అనంతరం గ్రామంలో ఊరేగించి నిమజ్జనం చేయడం ఆచారంగా వస్తోంది. ఈ ఏడాది కూడా గ్రామ పుర వీధుల్లో కుంతీదేవిని అంగ రంగ వైభవంగా ఊరేగించారు. అధిక సంఖ్యలో మహిళలు కుంతీదేవిని శిరస్సున పెట్టుకుని కోలాటం ఆడారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ బాణసంచా వెలిగించి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స, సర్పంచ్ రాణి, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ మండల శాఖ అధ్యక్షుడు చెక్కా జోగిరాజు, మాజీ ఉప సర్పంచ్ లంక రాంబాబు, డ్వాక్రా మహిళలు, కుంతీదేవి ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

కొంకసింగిలో తీర్థమహోత్సవం..

గొలుగొండ : సంక్రాంతి పండగను పురస్కరించుకుని మండలంలోని కొంకసింగిలో గురువారం తీర్థ మహోత్సవం జరిగింది. తీర్థాలకు కె.ఎల్.పురం, నాగాపురం, పాతకృష్ణదేవిపేట గ్రామాల నుంచి ఆయా గ్రామపెద్దలు తోడపెద్దులు, భజన బృందాలతో వచ్చారు. తీర్థంలో భజన కార్యక్రమాలు నిర్వహించారు. తీర్థం తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు హాజరయ్యారు.

ఎ. కొత్తపల్లిలో..

దేవరాపల్లి : మండలంలోని ఎ. కొత్తపల్లిలో ముత్యమాంబ అమ్మవారి తీర్థమహోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లాస్థాయి బాలుర కబడ్డీ పోటీలు హోరాహోరీగా జరిగాయి. స్థానిక సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, వైస్ ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో జిల్లావ్యాప్తంగా 15 టీమ్‌లు పాల్గొన్నాయి. ఉదయం 8 గంటల నుండి ప్రారంభమైన కబడ్డీ పోటీలు అర్ధరాత్రి వరకు జరిగాయి. ఈ పోటీలను జెడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, యువజన అధ్యక్షుడు కర్రి సూరినాయుడు, సర్పంచ్, వైస్ ఎంపీపీ, స్థానిక గ్రామ పెద్దలు ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలు ప్రారంభించారు. విజేతలకు వరుసగా రూ. 8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.2 వేలు చొప్పున నగదు బహుమతులు అందజేస్తారు. పోటీలు తిలకించేందుకు పరిసర గ్రామాల నుండి అధిక సంఖ్యలో ప్రజలు తరలి వచ్చారు. ఈ సందర్భంగా తెల్లవారి జాము నుండి భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. రాత్రి నిర్వహించిన సత్యహరిశ్చంద్ర, రామాంజనేయ యుద్ధం, గయోపాఖ్యానం, దేవనరక్తి తదితర పౌరాణిక నాటక ప్రదర్శనతో పాటు ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

మాడుగుల రూరల్ : కె.జె.పురంలో నేడు సీతారాముల వారి తీర్థం ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రామ సర్పంచ్ జామి రమణబాబు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయన్నారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తామన్నారు. ప్రథమ బహుమతిగా 3 తులాల వెండి, ద్వితీయ బహుమతిగా రెండు తులాల వెండి, తృతీయ బహుమతిగా ఒక తులం వెండితో పాటు పది కన్సొలేషన్ బహుమతులు అందజేస్తామని, నామినేషన్ ఫీజు ఉచితమన్నారు. అలాగే మధ్యాహ్నం 3 గంటల నుంచి దాతల సహకారంతో ఎస్సీ కాలనీలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలకు వరుసగా రూ. 10 వేలు, రూ. 8 వేలు, రూ. 6 వేలు, నాలుగవ బహుమతిగా రూ. 4 వేలు అందజేస్తామన్నారు. స్థానిక జనసేన పార్టీ ఆధ్వర్యంలో జరిగే ఈ వేడుకల్లో రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు, తోడపెద్దు సేవ గరిడీ జరుగుతాయన్నారు.

రసవత్తరంగా 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు



వద్దాదిలో రసవత్తరంగా సాగుతున్న ఆడుదాం ఆంధ్రా క్రికెట్ పోటీలు

బుచ్చెయ్యపేట : ఆడుదాం ఆంధ్రా క్రికెట్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. గురువారం మేజర్ పంచాయతీ వద్దాది కోవెల అప్పన్నదొర జిల్లా పరిషత్ హైస్కూల్లో పలు గ్రామాల నుండి వచ్చిన క్రీడాకారుల మధ్య ఉదయం నుండి సాయంత్రం వరకు క్రికెట్ పోటీలు జరిగాయి. రాజాం, పొట్టిదొరపాలెం, చింతపాక, లోపూడి, పి. భీమవరం, మల్లాం, కొమళ్లపూడి, వద్దాది గ్రామాలకు చెందిన జట్ల మధ్య హోరాహోరీగా క్రికెట్ పోటీలు సాగాయి. నైపుణ్యం కనబరిచిన జట్లను నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని ఎంపీడీవో సువర్ణరాజు తెలిపారు.

నాలుగు రోజులు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాడుగుల రూరల్ : పెందుర్తి, కశింకోట 132 కేవీ లైన్‌లో సబ్బవరం జాతీయ రహదారి వద్ద అభివృద్ధి పనుల నిమిత్తం 19వ తేదీ నుంచి 22వ తేదీ వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు నర్సీపట్నం ఏపీఈపీడీసీఎల్ (ఆపరేషన్) ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.డి.వి రామకృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. కె. కోటపాడు, వెంకన్నపాలెం, చోడవరం, బి. కింతాడ, దేవరాపల్లి, వారాడ, జన్నవరం, వద్దాది, రాజాం, పోలేపల్లి, చీడికాడ, అప్పలరాజుపురం, మాడుగుల, ఎం. కోడూరు, గాదిరాయి, కె.జె.పురం, తట్టబంద, రావికమతం కె.వి. సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

77 రెవెన్యూ గ్రామాల్లో చురుగ్గా భూ రీసర్వే

- ఆర్డీవో జయరామ్



మాట్లాడుతున్న ఆర్డీవో జయరామ్

నాతవరం : నర్సీపట్నం రెవెన్యూ డివిజన్‌లో మూడవ విడతలో 77 రెవెన్యూ గ్రామాల్లో జగనన్న భూ రీసర్వే చురుగ్గా జరుగుతోందని ఆర్డీవో హెచ్.వి. జయరామ్ తెలిపారు. గురువారం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. మండలంలో గల ప్రధాన సమస్యలను తహసీల్దార్ ఎస్.ఎస్.వి. శ్రీనివాస్‌నాయుడిని అడిగి తెలుసుకున్నారు. తర్వాత అధికారులతో సమావేశం నిర్వహించి పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాలను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రెండవ విడతలో 102 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి జగనన్న భూరక్ష 2020 రాళ్లు ఏర్పాటు చేశామన్నారు. రీసర్వే పూర్తి చేసిన రైతులకు ఆన్‌లైన్ పాస్ పుస్తకాలు ఉచితంగా అందిస్తున్నామన్నారు. అదే విధంగా ఎన్నికల కమిషనర్ ఆదేశాల ప్రకారం ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా సరి చేసే ప్రక్రియ తుది దశకు చేరిందన్నారు. దివ్యాంగులు, వృద్ధులు ఓటు వేసేందుకు ప్రత్యేక సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 25వ తేదీన జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని గుర్తింపు కలిగిన అన్ని రాజకీయ పార్టీ నాయకుల సమక్షంలో నిర్వహించేందుకు ప్రత్యేక దృష్టి సారించామన్నారు. డివిజన్‌లో నాతవరం, నర్సీపట్నం, గొలుగొండ మండలాలు తప్ప మిగతా మండలాలు పని విషయంలో వెనుకంజలో ఉండటంతో ఆయా తహసీల్దార్లలకు పని వేగం పెంచేలా సూచనలు చేశామన్నారు. అప్పటికీ వారిలో మార్పు రాకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం డివిజనల్ సర్వే ఆఫ్ ఇన్స్‌పెక్టర్ వెంకటరమణ, డిప్యూటీ తహసీల్దార్ చైస్లు, సీనియర్ అసిస్టెంట్ డి. కృష్ణ, ఆర్ఐ హరి, వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి

కె.కోటపాడు : గ్రామ పంచాయితీల అభివృద్ధి ప్రణాళికను సిద్ధం చేసుకునే కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములను చేయాలని మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి అన్నారు. కె.కోటపాడు ఎంపీడీవో కార్యాలయంలో గురువారం పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మహిళలు, బలహీన వర్గాలకు చెందిన ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని వారు సూచించిన అంశాలను కూడా ప్రణాళికలో చేర్చాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, సూపరింటెండెంట్ అప్పలరాజు, రీసోర్స్ పర్సన్ అప్పలరాజు, వైద్యం, వెలుగు, వ్యవసాయశాఖ, పశుసంవర్ధకశాఖ సిబ్బంది, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట



ఆరోగ్యశ్రీ కార్డులు అందజేస్తున్న వైద్యాధికారి సాయికిరణ్ తదితరులు

కె.కోటపాడు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తున్నాయని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి సాయికిరణ్ అన్నారు. మండలంలో సూర్రెడ్డిపాలెం, ఆర్.వై.అగ్రహారం, గొట్లాం, శృంగవరం గ్రామాల్లో గురువారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.25 లక్షల వరకూ కుటుంబానికి ఆరోగ్యశ్రీ పథకంలో ఉచితంగా కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం పొందేందుకు సీఎం జగన్ ఇప్పటికే నిర్ణయం తీసుకొని అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందుకు సంబంధించిన హెల్త్‌కార్డులను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో డీవీడీ ప్రసాద్, హెల్త్ సూపర్‌వైజర్ జె.సన్యాసిరావు, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్ర గాయాలు

దేవరాపల్లి : మండల కేంద్రం దేవరాపల్లిలో గురువారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. దేవరాపల్లికి చెందిన వెత్సా రమేష్ పెట్రోల్ బంక్ నుండి ద్విచక్ర వాహనంపై దేవరాపల్లిలోని తన ఇంటికి వస్తుండగా ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని ద్విచక్ర వాహనం బలంగా ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో రమేష్‌కు కాలు విరిగిపోవడంతో వెంటనే స్థానికులు విశాఖపట్నం తరలించారు. అలాగే రైవాడ నుండి పెట్రోల్ బంక్ వైపు వెళ్తున్న బొబ్బిలి దేముళ్లను కైరళీ స్కూల్ వైపు నుంచి వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో కె.కోటపాడు సీహెచ్‌సీకి తరలించారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు దేముళ్ల భార్య దేవి తెలిపారు.

నేటి నుంచి గ్రామ స్థాయిలో కులగణన

చీడికాడ : మండలంలోని 13 సచివాలయాల పరిధిలో శుక్రవారం నుంచి కులగణన జరుగుతుందని ఎంపీడీవో జయప్రకాష్ తెలిపారు. సచివాలయాల సిబ్బంది పర్యవేక్షణలో వలంటీర్లు ఇంటింట సర్వే నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

నేడు పప్పుశెట్టిపాలెంలో 'జగనన్న సురక్ష'

గొలుగొండ : మండలంలోని పప్పుశెట్టిపాలెంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి శ్యామ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు కొండల అగ్రహారంలో..

మాకవరపాలెం : మండలంలోని కొండల అగ్రహారంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహిస్తున్నట్టు వైద్యాధికారి సీతారామలక్ష్మి తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇక్కడి ప్రాథమికోన్నత పాఠశాల వద్ద ఈ శిబిరం కొనసాగుతుందన్నారు. సచివాలయం పరిధిలోని గ్రామాల ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో సీతామహాలక్ష్మి



హాజరైన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు



మాట్లాడుతున్న ఎంపీడీవో హనుమంతరావు

మాకవరపాలెం : గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించడంపై మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో సీతామహాలక్ష్మి మాట్లాడుతూ పంచాయతీలకు వచ్చే ఆదాయాన్ని బట్టి ఆయా గ్రామాల్లో ఏయే పనులు చేసుకోవాలి, వాటికి ప్రణాళికలు ఏ విధంగా తయారు చేయాలనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏవో చిరంజీవి, ఎంఈవో మూర్తి, పీఆర్ జేఈ వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు..

రోలుగుంట : స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో రెండు రోజుల పాటు పంచాయతీ కార్యదర్శులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు గురువారంతో ముగిసాయి. తొలిరోజు బుధవారం మండలంలో గల 24 పంచాయతీలకు గాను 12 పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి, రెండవ రోజు గురువారం మిగిలిన 12 పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి ఈవోపీఆర్డీవో కె.నూకరాజు, రిసోర్స్ పర్సన్ సంతోష్ రికార్డుల నిర్వహణ, నిధుల వినియోగం, పారిశుధ్య, అభివృద్ధి పనులపై శిక్షణ ఇచ్చారు.

మండల పరిషత్ కార్యాలయంలో..

నాతవరం: గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేసేందుకు 2024-25 సంవత్సరాలకు సంబంధించి శాఖల వారీగా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని ఎంపీడీవో హనుమంతరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అధ్యక్షతన సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఇప్పుడు తయారు చేసిన ప్రణాళికల ఆధారంగా రానున్న రోజుల్లో పంచాయతీలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందన్నారు. ప్రభుత్వ ఆదేశాలు తదితర అంశాలను సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులకు క్లుప్తంగా వివరించారు. గ్రామాల అభివృద్ధికి సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ప్రతిపాదనలు చేస్తే ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స, వైస్ ఎంపీపీ మైనం శ్రీనాగగోపి, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారథి, పంచాయతీ విస్తరణాధికారి మూర్తి, అధికారులు పాల్గొన్నారు.

సమగ్ర ప్రణాళికతోనే అభివృద్ధి

నర్సీపట్నం: అభివృద్ధికి సంబంధించి సమగ్ర ప్రణాళిక తయారు చేయాలని ఎంపీపీ సుర్ల రాజేశ్వరి అధికారులకు సూచించారు. గ్రామ, బ్లాక్ పంచాయతీల అభివృద్ధిపై సమగ్ర ప్రణాళిక రూపొందించటంపై మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సర్పంచ్‌లు, గ్రామ, మండల స్థాయి అధికారులతో శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను ప్రామాణికంగా తీసుకుని ఆ నిధులతో ఏయే పనులు చేపట్టాలనే దానిపై సమగ్ర ప్రణాళిక తయారు చేసి ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో జయమాధవి, వైస్‌ఎంపీపీ తాతబాబు, కార్యాలయ సూపరింటెండెంట్ రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ కార్యక్రమం నేడు..

దేవరాపల్లి : గ్రామ పంచాయతీ, మండల, జిల్లా స్థాయి అభివృద్ధి ప్రణాళికల తయారీపై శుక్రవారం శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సీహెచ్ సుబ్బలక్ష్మి తెలిపారు. ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ శిక్షణ కార్యక్రమానికి ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జెడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం సహా అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరవుతారన్నారు. అన్ని శాఖల అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు హాజరు కావాలన్నారు.



శిక్షణ ఇస్తున్న అధికారులు



మాట్లాడుతున్న ఎంపీపీ సుర్ల రాజేశ్వరి

నేడు ఆర్. భీమవరంలో ఎడ్ల పందాలు

బుచ్చెయ్యపేట : మండలంలో గల ఆర్. భీమవరంలో శుక్రవారం సీతారాముల తీర్థ మహోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పందాలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే ఉట్టికొట్టు, ముగ్గుల పోటీలు నిర్వహించి గెలిపొందిన విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. తీర్థ మహోత్సవంలో తప్పెటగుళ్లు, తోడపెద్దు భజన, మహిళల కోలాటం ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు.

నిరుపేదలకు వస్త్రాల పంపిణీ

అనకాపల్లి : పట్టణంలో గవరపాలెం పీలావారి గౌరీపరమేశ్వరుల ఆలయంలో గురువారం శ్రీ వినాయక గౌరీ సేవాసమితి ఆధ్వర్యంలో ఆలయ నిర్వాహకులు 300 మంది నిరుపేదలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ సంక్రాంతి పండగను పురస్కరించుకొని పేదలకు వస్త్రదానం చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు ఆలయ శాశ్వత చైర్మన్ భీమరశెట్టి వరహా నూకరాజు, అధ్యక్షుడు భీమరశెట్టి శ్రీనివాసరావు, కార్యదర్శి బుద్ద బల్లమ్మనాయుడు, కోశాధికారి

కె.జె.పురంలో ఎన్టీఆర్ వర్ధంతి



కె.జె.పురంలో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీనివాసరావు తదితరులు

మాడుగుల రూరల్ : దివంగత, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతి కె.జె.పురంలో గురువారం నిర్వహించారు. స్థానిక ఎంపీటీసీ సభ్యుడు, క్లస్టర్ ఇన్‌చార్జి భీశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాపేట జోగినాయుడు, కర్రి నాగమణి, ఆడారి బాబ్జి, యల్లపు రాము పాల్గొన్నారు.

రావికమతం, కొత్తకోటలో..

రావికమతం : రావికమతం, కొత్తకోట గ్రామాల్లో ఎన్టీఆర్ వర్ధంతి గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటాల వద్ద టీడీపీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కోట నీలవేణితో పాటు పలువురు నివాళులర్పించారు. పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు.